## రాజనీతి

హైదరాబాద్ విమానాశ్రయంలో-శాస్త్రిగార్ని రాజుగారు 'హల్లో' అని పలకరించి "కులాసా?" అని అడిగారు. "ఆ ఏం కులాసా!" అని పెదవి విరిచి, ఛాతీమీద, చేత్తో రాసుకుంటూ "మెడికల్ చెకప్‌కిస్టేట్సు వెళ్ళాలనుకుంటున్నాను" అన్నారు శాస్త్రిగారు. "ఆపరేషనా-" అన్నారు రాజుగారు. అవునండీ-ఏమవుతుందో-ఏం జరుగుతుందో?" అని దిగాలు పడినట్లు కనిపించారు. "వర్రీ అవకండి ఆపరేషన్ సక్సెస్‌ఫుల్ అవుతుంది" "ఆ- ఏం జరుగుతుందో? ఏదీ మన చేతులో లేదుకదా!" అని కించిత్తు నిస్పృహగా చేతులు తిప్పారు శాస్త్రిగారు. రాజుగారు శాస్త్రిగారి వీపుమీద తట్టి "అమెరికా వెళ్ళేముందు ఏవన్నా మంచిపనులు చేసి వెళ్ళండి సార్!" అన్నాడు "అంటే-" అని అర్థోక్తిలో ఆగారు. "మీకు తెలియనిదేవుందీ? వుంటే వుంటాం పోతే పోతాం. ఈ వున్నదంతా కట్టుకు పోతామా? మీ ఫ్యాక్టరీలో వర్కర్స్‌కీ వాళ్ళకీ క్వార్టర్స్ లాటివి కట్టించండి. దానధర్మాలు విరివిగా చెయ్యండి-" అన్నారు రాజుగారు. శాస్త్రిగారు దీర్ఘంగా ఆలోచించి "ఎవరికీ ఏదీ ఊరికే యివ్వకూడదండీ. ప్రయత్నం లేకుండా లభించిన వస్తువుకి విలువేం వుంటుందీ?"

"ఆ మాట నిజమే అనుకోండి. మనకున్నదంతా మనవాళ్ళకే యిస్తే మటుకు ప్రయత్నం కాకుండా వచ్చిన ఆస్తివల్ల దుఃఖమేగాని సుఖంలేదు. అయినవాళ్ళు ఇవ్వకేం చేస్తాడు. రాకేం చేస్తుంది అన్న ధీమాతో వుంటారు. అదే పేదవారికి, మన్ని కనిపెట్టుకునివున్న సామాన్యులకీ ఎంత చిన్న ఉపకారం చేసినా గుర్తు పెట్టుకుని గౌరవిస్తారు" శాస్త్రిగారు యింకా గంభీరం అయిపోయారు.

"ఈ షేర్లూ ఈ కంపెనీలూ ఈ లావాదేవాలు యివన్నీ నేను కష్టపడి పెంచి పోషించి సంపాదించినవి. వీటిని వారికి వీరికి ధారపోయాడానికి నాకు మనసంగీకరించదు. అని

మంచి పనిలా పైకి కనిపించినా నేనలా ఉత్తినే యివ్వలేను." రాజుగారు యింకాస్త చొరవ తీసుకుని-

"ఇప్పుడు మీరు యిలా అంటున్నారుగాని ఎవరికైనా ఏదయినా ఇవ్వడంలోవున్న హాయి మీకు తెలీదు. the more you give the you more you can have అన్నాడు షేక్స్‌పియర్."

"నేనంత చదువుకోలేదుగాని, అంతా నన్ను కోటీశ్వరుడనుకుంటారు. నాకున్నన్ని బాధలు, నాకున్నన్ని టెన్షన్లు, నా మీదవున్న బరువులు నాకున్న కష్టాలు మీకు తెలీదు అసలు నాకు నిద్రే పట్టదు, ఎవడు కొంపముంచుతాడో, ఎక్కడనుంచి ఏం ప్రమాదం పొంచి చూస్తుందో, ఎవరు ఎసరు పెడతారో అనేభయం- ఈ భయంతో ఛస్తున్నాననుకోండి. నాకు దేని మీద విశ్వాసం లేదు నేను ఎవర్నీ నమ్మలేను. నాకంటే దురదృష్ట జీవి ఈ ప్రపంచంలో మరొకడుండడు" గజంనర పొడవునిట్టూర్పుని విడిచారు శాస్త్రిగారు.

"ఎలాగూ అమెరికా వెళుతున్నారు. వెళ్ళేముందు ఏదయినా మంచిపని చేసి వెళ్ళమని నా సలహా-అది మీ మనసుకి గొప్ప తృప్తినిస్తుంది" రాజుగారు రెట్టించారు.

శాస్త్రిగారు నవ్వారు- "మనం సంపాదించినదీ మన వంశంవారు తింటే తృప్తికాని వాళ్ళకిస్తే మనకేం తృప్తి" అని ఆ చర్చను క్లోజ్ చేశారు.

శాస్త్రిగారు పద్మినీజాతి స్త్రీ పంచె లాల్చీ వేసుకుంటే ఎలా వుంటుందో అలావుంటారు ఆయనది మెత్తనిమనస్సు, కత్తిలాంటి మనసు. ఆయన బ్రెయిన్‌ని వాళ్ళ ఆఫీసువారు కంప్యూటర్ తోనూ ఆయనకున్న పవర్ని విష్ణుచక్రంతోనూ పోలుస్తారు. ఋషులకుమల్లె గడ్డంలేకపోయినా ఆయన దూర్వాసుళ్ళా శపించగలరు. మీసాల్లేకపోయినా లోకాన్ని భయపెట్టగలరు. ఆయన ఏదయినా చేయగలరుగాని, మీదకువచ్చి వాలుతున్న గుండె జబ్బును మాత్రం ఏమీ చేయలేకపోయారు. ఆయన కేదయినా జరిగితే ప్రపంచమంతా యథాప్రకారంగా వున్నట్లు కనిపిస్తుందికాని, అందులో శాస్త్రిగారికి సంబంధించిన ప్రపంచం మాత్రం యథా ప్రకారంగా వుండదు.

ఇప్పుడు శాస్త్రిగారూ, రాజుగారూ హైదరాబాదు టు బొంబాయి ఫ్లయిలెట్‌లో కులాసాగా మాట్లాడుకుంటూన్నట్లు కనిపిస్తున్నారు గాని- శాస్త్రిగారి స్టేటస్ బిందెముందు మరచెంబు స్టేటస్ లాటిది. శాస్త్రిగారిని పరామర్శించినట్టు పరామర్శించి ఆయనచేత దానధర్మాలకు కమిట్ చేయించాలని రాజుగారి ఆలోచన. ఈ వాళ వంట్లో బాగులేదుకదా అని వీడు నన్ను పోయేవాడికింద జమకట్టి మాట్లాడతాడా అని లోపల శాస్త్రిగారికి ఓ ఫీలింగ్ వుంది. కాని తను చండశాసనుడు-తన పెత్తనం పోవాలనీ, తమకు పూర్తి అధికారంలో హక్కులూ రావాలనీ తన పెళ్ళాం పిల్లలూ, తమ్ముళూ, బావమేర్దులూ! అంతా తపస్సు చేస్తున్న సంగతి శాస్త్రిగారికి తెలుసు అయినా ఆయన లొంగడు.

శాస్త్రిగారికి అమెరికా కొట్టిన పిండి. ఖరీదైనా మనుషులకి ఖరీదైన జబ్బులూ,

వాటికి ఖరీదైన దేశాల్లో ఖరీదైన వైద్యాలూ, జరగక తప్పవుకదా! శాస్త్రిగారు అటువంటి ఖరీదయిన ప్రమాదంలో యిరుక్కొని ఖరీదయిన ప్రయాణంలో మొదటి సజీవాలో వున్నారు. అసలాయనకు శ్రేయోభిలాషులు యిక్కడ ఇండియాలోకన్న అక్కడే అమెరికాలో ఎక్కువ మంది వున్నారు. విమానం దిగేముందు రాజుగారు ఉరుకోకుండా మళ్ళా కదిపారు." అయ్యా మీరు సంపన్నులూ లక్ష్మి పుత్రులూ గనక యిటువంటి క్లిష్టమైన ఆపరేషన్‌కు లక్షలు ఖర్చుపెట్టి పోరాడి ఆరోగ్యాన్ని జయించుకు రాగలరు. మా బోటి వాళ్ళ కేదన్నా వస్తే ఈ డొనేషన్లు కట్టి పాసయిన డాక్టర్ల చేతుల్లో హరీ మనవలసిందే కదా!" అన్నారు.

"మీకు రావు, మీరు నాకంటె అదృష్టంతులు" అన్నారు శాస్త్రిగారు.

"సరె మన సంగతి అలా వుంచండి. ఈ బీదా బిక్కీ, సన్నకారు మనుషులు సరైన వైద్యాలులేక, ఖర్చుపెట్టుకో లేక ప్రాణాలు వదిలేస్తుంటారు గదా-తల్చుకుంటే నాకు ఘోరం అనిపిస్తుంది సార్" అన్నాడు.

"ఆయుర్దాయం లేకపోతే అమెరికా వెళ్ళినా అనకాపల్లి వెళ్ళినా ఒకటే-రాజుగారూ! మా కివి తప్పవు. ఇవి శాపాలు. మీరు వెయ్యి చెప్పండి, బీదా బిక్కీ ఉన్నంత హాయిగా మనం ఉండగలమా? మనం వాళ్ళకి సుఖాన్ని గుప్పి స్ట్రగుల్ లేకుండా చేస్తే వాళ్ళకీ ఈ ఖరీదైన జబ్బులన్నీ పాకుతాయి.

"బలే ఆలోచిస్తారే మీరు? పేదలు సుఖపడుతున్నారు, శ్రీమంతులు కష్టపడుతున్నారు అని మీ తాత్పర్యం ఔనా?"

"ఛ- ఛ - don't make me a fool. కష్టపడి సంపాదించిన దాని విలువ ముందు ఆయాచితంగా పొందే దానికి విలువ వుండదు అని నా వుద్దేశం. మా వాళ్ళకన్నీ డాబులూ దర్జాలూ తప్ప ఇనీషియేటివ్, స్ట్రగులూ ఎక్కడుందీ?"

"ఉన్నది కాపాడుకోవడానికి మనకు స్ట్రగుల్ ఎక్కువ కదండీ-అదే మనకొంప తీస్తుంది. ఈ గాడ్ గీడ్ యిలాంటివి మీకు వున్నాయా లేక నాస్తికులా?"

"నేను ఆస్తికుడ్నే నండోయ్ భగవంతుడ్ని నమ్ముతాను కాని, భగవంతుడే నన్ను నమ్మడేమోనని భయం!"

ఇద్దరూ మనస్ఫూర్తిగా నవ్వుకున్నారు. ప్రయాణం ముగిసింది.

■

ఆ శ్రీనివాసుని కటాక్ష వీక్షణ పరంపరవల్లా, పూర్వజన్మ సుకృతంవల్లా, పెళ్ళాం బిడ్డల అదృష్టంకొద్దీ శాస్త్రిగారు చాలా పెద్ద ఆపరేషన్ చేయించుకుని, పునర్జన్మ పొంది సురక్షితంగా ఇండియా తిరిగి వచ్చారు. అని అంతా సంతోషించారు. ఈ పునర్జన్మ ఖరీదు రెండున్నర లక్షల రూపాయలు అయినా ఫరవాలేదు. శ్రీ శాస్త్రిగారి ఆరోగ్యాన్ని

ఖరీదు కట్టగలమా? ఆయన రీడబల్డ్ ఎనర్జీతో పనీపాటలూ చూసుకుంటున్నారు. ఆయన బుద్ధి సూక్ష్మత వ్యవహర చాతుర్యం, పరిపాలనా దక్షత ఇనుమడించాయి కాని తగ్గలేదు. యథాప్రకారం ఆయన కుటుంబ సభ్యులే ఆయనతో చనువుగా మాట్లాడ్డానికి జంకుతారు. శాస్త్రిగారు మంత్రి పదవిని తిరస్కరించారనే వదంతి పరిచి కొందరు ఆశ్చర్యంగా చెప్పాలనుకున్నారు. పవర్ ఆఫ్ మనీ గురించి శాస్త్రిగారికి తెలిసినంత మరెవరికీ తెలీదు. డబ్బు తరవాతే గాడ్, కల్చర్ ఎడ్యుకేషన్ అన్నీనూ, డబ్బు కొందరి దగ్గరికే చేరుతుంది. అది ఎందుకు చేరుతుందో శాస్త్రిగారికంటే ఎక్కువ ఇంకెవరికి తెలుసు?

❚❚

ఇలా వుండగా-

ఓ రోజు.

శాస్త్రిగారు బాత్రూంలో స్నానానికి వెళ్ళారు. ఆయన ఛాంబర్స్‌లో అన్ని బాత్రూంల్లోనూ షవర్లు. బాత్ టబ్బులూ, ఖరీదైన స్నానావసర ద్రవ్యాలూ, దుప్పట్లని వెక్కిరించేమెత్తని తువ్వాళ్ళు, చక్కని శాండల్సూ యింకా ఎన్నో వుంటాయి. సామాన్యు లెవరైనా అందులోకి అడుగుపెడితే ఏది ఎందుకో ఏ మీట తిప్పితే ఏమి వస్తుందో తెలీక గాబరా పడిపోతారు. శ్రీవారి బాత్రూముని పట్టి శ్రీవారి స్టేటస్సు తెలుస్తుంది.

శాస్త్రిగారూ మితభాషి. చాలా రిజర్వుడు. ఎవరితోనూ కలవరు! ఆయన ఛాంబర్స్‌లోకి ఎవ్వరూ పిలవకుండా వెళ్ళరు. ఆయనకు తెలియకుండా అదృశ్యశక్తులేవో అన్ని పనులూ చేసుకుంటూ పోతాయి.

మనుషులకి దూరంగానూ, ఐశ్వర్యానికి అధికారానికీ, చేరువగానూ జీవించడంలో ఒక గమ్మత్తు వుంది. అదేవిటంటే శ్రీవారి దర్శనం అపురూపం కావడం. వారి పలకరింపే మహాప్రసాదంలా అంతా భావిస్తారు కాని, ఆ ఏకాంత మందిరంలోకి మీట నొక్కకుండా సరాసరి వచ్చే అర్హత ఒక్కరికే వుంది. ఆ ఒక్కరెవరో కాదు. బాల్చీ, చీపురూ, ఫెనాయిలూ పట్టుకుని మూడు బాత్రూములను శుభ్రంచేసే పాకీ మనిషి పార్వతి.

పార్వతికి మేనర్స్ తెలీవు. శాస్త్రిగార్ని చూడగానే

"బావున్నావా బాబూ" అంటుంది. ఆయన ఒక చిరునవ్వు నిదానం చేస్తారు. అది వెళ్తూ-

"బాబూ రెండో బాత్రూంలో కెళ్ళకు బాబూ జార్తావు" అని వార్నింగిస్తుంది. ఏ బాత్రూం నిషిద్ధమో అది నిర్ణయిస్తుంది.

అది నడివయస్సు మనిషి ఆ వయసు ఆడదానికి ఎక్కడ ఎలావుండాలో అలా హెచ్చుతగ్గులు లేకుండా అందచందాల్తో దాన్ని సృష్టించాడు బ్రహ్మ. ఆ మూడు బాత్రూములమీద పెత్తనం దానిదే, శాస్త్రిగారు అమెరికానుంచి వచ్చాక ఎవరు అడగని ప్రశ్న అది అడిగింది.

"అక్కడ పాకీదానికి జీతం ఎంతిస్తారు బాబూ" అని.

ఆయన పక పకా నవ్వి "నాకు తెలీదే" అన్నారు.

"అక్కడ  బాత్రూము తుడిచేవాళ్ళు దొరబాబుల్లాగ కార్లలో వత్తరట నిజవేనా బాబూ" అని మరో ప్రశ్నవేసింది.

"వస్తారనుకుంటా" అని దాని యక్షప్రశ్నలు తుంచేసారు మరి అడక్కుండా.

కాని పార్వతి వూరుకోలేదు.

"ఏటి బాబూ నీకు జబ్బు?" అని లాలనగా అడిగింది పార్వతి.

ఆయన దాన్ని నిరుత్సాహ పరచలేక చేతితో ఛాతీమీద రాసుకుని "ఇక్కడ నొప్పి" అన్నాడు.

"ఉప్పు కాపడం పెట్టించుకోక పోయావా?" అని యీ మాత్రం తెలీదా అన్నట్లు అడిగి "గుండె జబ్బే"అని చెప్పగా "నీది సిన్న గుండె బాబూ" అని పిడికిలితో చూపించి "ఈసుట్టుబావున్నావు తెల్లగా ఎండలో పనస తొనలా మెరిసిపోతున్నావ్" అని రెండు పిడికళ్ళనూ తలకు చేర్చి దిష్టి తీసింది. ఇంక యిది మాటల్తో దాని లెవెల్లోకితను దించుతుందని  శాస్త్రిగారు గబ గబా స్నానానికి మూడో నెంబరు బాత్రూంలోకి వెళ్ళారు. వెళ్ళి ఇంటర్ లాక్ వేసుకొని కాలకృత్యాల్లో పడ్డారు.

పార్వతి ఒకటీ రెండూ శుభ్రం చేస్తున్నది. శాస్త్రిగారు మూడో నెంబరు బాత్రూంలోకి వెళ్ళడం అది చూడలేదు.

బాత్రూం ఎంత స్వర్గతుల్యంగా వున్నా మనుషులు అందులో ఎక్కువసేపు వుండలేరు. శాస్త్రిగారు స్నానాదికాలు పూర్తి చేసుకుని తలుపు తోయబోతే అది రాలేదు. ఆ ఇంటర్ లాక్‌ను గుంజగా తలుపు మరీ బిగుసుకుపోయింది.

శాస్త్రిగారికి చిరాకుగా వుంది. కేకలు పెడదామనుకున్నాడు గాని అతనంతవాడు అరిస్తే వినే వాళ్ళెవరూ చుట్టుప్రక్కల వుండరని ఆయనకు తెలిసి వూరుకున్నాడు.

వెంటిలేటర్ చాల చిన్నది అది వెలుపలికి వున్నది కాని, కమోడ్‌మీద ఎక్కి పిలిచినా ఎవరూ కనపడరు, ఎవరికీ వినిపించదు.

"ఒక అరగంట గడిచేసరికి శాస్త్రిగారికి ముచ్చేమటలూ పోసేశాయి. ఇప్పుడు తను ఈ బాత్రూంలో బందీ-తలుపును అరికాలితో తన్నాడు అరికాళ్ళు నెప్పులు పెట్టాయి కాని తలుపు మరింత బిగుసుకుపోయింది.

నీరసం వస్తోంది ఆయాసంగా వుంది కళ్ళు తిరుగుతున్నాయి. ఇప్పుడు ఏమైనా జరిగితే- ఇంత జాగ్రత్తగా ఇన్ని లక్షలతో కాపాడుకుంటూ, వస్తూన్న ఈ శరీరం యిలా ఈ బాత్రూంలో అంతమయిపోవలసిందేనా అనే ఆలోచన వచ్చి ఆయనకు భయం వేసింది.

తన కేసి చూసుకుంటే బాత్రూం టవల్ తప్ప తనమీద యింకేమీ లేదు. ఈ లక్షలూ కోట్లూ, వ్యాపారాలూ, అధికారాలూ, కార్లూ, షేర్లూ, పలుకుబడీ, పరువూ అన్నీ బాత్రూం

బయటే వున్నాయి. జామ్ అయిపోయిన ఈ తలుపు లోకాన్నుంచి తనను వేరుచేసి శిక్షిస్తున్నట్టుగా వుంది. ఏమయితే అయిందని ఆయన పెద్ద పెద్ద కేకలు పెట్టారు. తన కేకలెవరికీ వినపడవు ఇప్పుడు తను ఏకాకి, ఇప్పుడు తనకెవరూలేరు. భగవంతున్ని ప్రార్థిద్దామంటే ఒక్కశ్లోకం కూడా గుర్తుకురాలేదు మనసు క్రమంగా శూన్యమయిపోతుంది.

తన జీవితం ఖరీదు ఏమిటి? ఈ తలుపు తెరుచుకుంటే తను మారిపోతాడు. తన అభిప్రాయాలన్నీ మార్చుకుంటాడు. ముందు తలుపెవరు తెరుస్తారా?

తెరిస్తే-మళ్ళీ తను ప్రపంచంలో పడితే-తలుపు తెరిచినవారికి ఏది కావాలిస్తే అది ఏమయినా ఇస్తాడు. తన ప్రాణం విలువ తలుపుకి వెధవ తలుపుకి తెలీదు. శాస్త్రిగారికి నీరసం, ఆయాసం, కంగారు ఎక్కువయి కమోడ్ మీంచి జారి వాగ్ బేసిన్‌కీ బాత్ టబ్‌కి మధ్య నేలమీద పడిపోయారు. ఆయన చుట్టుకున్న టవల్ కూడా వూడిపోయి- తల్లి గర్భంలోంచి వచ్చినపుడు ఎలా వున్నాడో అలా వున్నాడు. భయం అనేది ఆయన్ను మబ్బులా కమ్మేసి పడుకోపెట్టింది. పార్వతి రెండు బాత్రూములూ తుడిచి మూడో బాత్రూం దగ్గరకు వచ్చేసరికి అది బిగుసుకుపోయి తలుపు రాలేదు.

"బాబూ బాబూ" అని అది గుంజింది. దానికి తెలుసు మూడో బాత్రూంలో తలుపు అప్పుడప్పుడు లోపల బిగుసుకు పోతుందని.

"బాబు నీకేం భయంవేదు." అని అది వెళ్ళి బాకులూ గరిటెలూ వూచలూ తెచ్చి తిప్పింది. అలా తిప్పగా ఓ పావుగంటకి తలుపు తెరుచుకుంది.

పార్వతి పరిగెత్తికెళ్ళి శాస్త్రిగార్ని పట్టుకుని కుదిపి

"లెగు బాబూ లెగు నీదసలే పిరికిగుండె-" అని నగ్నంగా వున్న శాస్త్రిగార్ని మెల్లిగా ఈడ్చుకువచ్చి గదిలో నేలమీద పడుకోబెట్టి పొడిబట్ట తెచ్చి కప్పింది. గుండెలమీద రాసింది. అరికాళ్ళు, అరిచేతులూ మర్దన చేసింది. నోట్లో నోరుపెట్టి గాలి ఊదింది.

చాలాసేపటికి శాస్త్రిగారు కళ్ళు తెరిచారు.

"బతికిపోయావ్ బాబూ నీ అమ్మ కడుపు చల్లగా-"

ఆయన కనుకొలనుల్లోంచి కన్నీరు రాలింది, పార్వతి తుడుస్తూ "పడకు బాబూ పడకు నాతోసెప్పకుండా అందులా కెందులా దూరినావో" అని కోప్పడి మంచంమీద పడుకో పెట్టింది. వళ్ళంతా మళ్ళీ రాసింది.

"గుమాస్తాగార్ని పిల్నా" అంది వద్దన్నట్టు తల అడ్డంగా తిప్పారు శాస్త్రిగారు.

పార్వతి తనబాల్చీ, తుడుపుగుడ్డా, ఫినాయిల్ సీసా తీసుకుని గదిలోంచి తల్లి నీడ కనుమరుగైనట్టు అదృశ్యమయి పోయింది.

ఆ మర్నాడు శాస్త్రిగారు మామూలు మనిషయ్యాక

"పార్వతి"ని పనిలోంచి తీసేశారు ఈ కథ యింతే!